క్లుప్తంగా

నేడు కిడ్నీ రోగులకు వైద్య పరీక్షలు

సోంపేట: జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు సోంపేట సామాజిక ఆస్పత్రి ఆవరణలో మంగళవారం కిడ్నీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ పరిధిలోని కిడ్నీ రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

టెక్కలి: రావివలస పంచాయతీ వార్డు సభ్యురాలు కొర్రాయి శాంతి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. రూ. ఐదు వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, నాయకులు సర్లాన సుధాకర్, శ్రీరాములు, జోగారావు, చంటి, రాజేష్ ఉన్నారు.

ఆదిత్యలో జాతీయ స్థాయి గోకార్టింగ్ పోటీలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో గోకార్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. వచ్చేఏడాది మార్చి నాలుగు నుంచి ఏడో తేదీ వరకూ జాతీయ స్థాయిలో ఈ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నాలుగు లక్షల రూపాయల విలువైన బహుమతులు అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కన్వీనర్ డి.శ్రీరాములు, హెచ్‌వోడీ, అధ్యాపకులు వి.అశోక్ కుమార్, వై.రమేష్, డి.రఘువీర్ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు: కేంద్ర మంత్రి

కాశీబుగ్గ: సౌదీలో చిక్కుకున్న జిల్లా వాసులు అధైర్యపడొద్దని..వారికి అండగా ఉంటామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక రూంలకు పరిమితమై నాలుగు రోజులుగా భోజనానికి దూరమైనట్లు సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేసిన జిల్లా యువకులతో ఆయన ఫోన్‌లో సోమవారం మాట్లాడారు. వజ్రపుకొత్తూరు, నందిగాం, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేటతో పాటు గంజాం జిల్లాకు చెందిన 30 మంది యువకులు సౌదీలో ఉపాధి నిమిత్తం వెళ్లి చిక్కుకున్నట్లు గుర్తించారు. ఇదే విషయం 'సాక్షి' దినపత్రిక ఆదివారం ప్రచురించడంతో దీనిపై అధికారులు, నాయకులు స్పందించి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సౌదీలో పరిస్థితిపై విదేశాంగ మంత్రి జైశంకర్‌తో మాట్లాడి జిల్లా వాసులను ఇక్కడకు తీసుకురావడానికి ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి ధైర్యం చెప్పారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం: చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని పట్టణ సీఐ మీసాల చిన్నంనాయుడు సూచించారు. మున్సిపాలిటీలోని నీలకంఠేశ్వరాలయం వీధిలో యువతకు, ప్రజలకు యాంటీడ్రగ్స్, సైబర్‌నేరాలపై సోమవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఎస్సై చిన్నంనాయుడు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని కంచమ్మ తల్లి అమ్మవారి ఆలయం హుండీలో కానుకలను ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సోమవారం సాయంత్రం లెక్కించారు. నవంబర్ నెలలో భక్తులు కానుకలుగా 18,070 రూపాయలు హుండీలో వేసినట్లు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వంకట సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల సమరం!

- 5న నోటిఫికేషన్, 8న ఎన్నికలు, అదే రోజు ఫలితాలు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత తొలి ఎన్నికలు
- ఓటర్ల వివరాలపై గ్రామ స్థాయిలో సమాచారం లేదంటున్న రైతులు
- కొంతమంది రైతుల పేర్లు గల్లంతు చేశారని ఆవేదన



టెక్కలి సమీపంలో అత్యధిక ఆయకట్టు కలిగిన మధనగోపాలసాగరం

టెక్కలి:

కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత గ్రామ స్థాయిలో మొట్టమొదటి సారిగా సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత రైతుల మధ్య తగాదాలు చోటు చేసుకుంటున్నాయనే కారణాలతో పాటు మరికొన్ని ఇబ్బందులతో ఈ ఎన్నికలను నిలిపివేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల ఐదో తేదీన నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహించి అదే రోజున ఫలితాలు ప్రకటించనున్నారు. అయితే ఈ ఎన్నికలకు సంబంధించి రైతుల ఓటర్ల వివరాలపై కనీసం సమాచారం లేదని రైతులు చెబుతున్నారు. మరో వైపు తమ వివరాలను గల్లంతు చేశారని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి సర్కార్‌కు మొదటి ఎన్నికలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత మొదటి సారిగా క్షేత్ర స్థాయిలో రైతులకు సంబంధించి నీటి సంఘాల ఎన్నికలను నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికల ముునుపు ఇచ్చిన హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలు ఇస్తామనే హామీని ఖరీఫ్‌లో నెరవేర్చలేదు. రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయలేదు. ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. వ్యవసాయంతో అనుబంధం కలిగిన పాడికి సంబంధించిన పశువులకు మందులు సరఫరా నిలిచిపోయింది. విశాఖ డెయిరీ ద్వారా పాడి రైతుల నుంచి సేకరిస్తున్న పాల ధరలను తగ్గించేశారు. నిరంతరం రైతులకు మోసం చేస్తూ ఇప్పుడు సాగు నీటి సంఘాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అన్నదాతలు ఏవిధంగా స్పందిస్తారో చూడాల్సిందేనని చర్చించుకుంటున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో వివరాలు ఇలా..

సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలో మేజర్, మైనర్ విభాగాల్లో సుమారు 394 టీసీలను గుర్తించారు. ఆయా టీసీల్లో సుమారు 1,10,542 మందిని రెవెన్యూ రికార్డుల్లో నమోదైన రైతులను ఓటర్లుగా గుర్తించారు. ఒక్కో సాగు నీటి సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. వీరిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.



టెక్కలిలో వంశధార ఉప కార్య నిర్వాహక ఇంజినీర్ కార్యాలయం

ఎటువంటి సమాచారం చెప్పలేదు



సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల వివరాలు, ఎన్నికల ప్రక్రియ గురించి ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం చెప్పలేదు.కొంతమంది రైతుల పేర్లను గల్లంతు చేసినట్లు తెలుస్తుంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతీ రైతుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

–హెచ్.వెంకటేశ్వరరావు, రైతు, తలగాం

రికార్డుల్లో పేరు ఉన్న ప్రతిఒక్కరూ అర్హులే..



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో పేరు ఉన్న ప్రతీ ఒక్క రైతు ఓటరుగా అర్హులే. ఇప్పటికే మేజర్, మైనర్ పరిధిలో టీసీలతో పాటు రైతులను గుర్తించాం. ఆయా వివరాలను గ్రామ సచివాలయాల్లో పబ్లికేషన్ చేశాం.

–కె.దిలీప్‌చక్రవర్తి, తహసీల్దార్, టెక్కలి

ఏపీడీ విచారణ



విచారణ చేస్తున్న ఏపీడీ శైలజ

నందిగాం: మొండ్రాయివలస ఉపాధిహామీ క్షేత్ర సహాయకునిపై టెక్కలి క్లస్టర్ పరిధి ఏపీడీ శైలజ సోమవారం విచారణ చేపట్టారు. క్షేత్రసహాయకునిపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఆమె నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనుంది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నందిగాం మండలంలో మధ్యాహ్న భోజన పథకం వంటవారిని, ఆయాలను, వెలుగు సీఎఫ్‌లు, ఆశావర్కర్లు వంటి పలువురును ఉద్యోగాల నుంచి తొలగిస్తున్న నేపథ్యంలోనే ఈ విచారణ నిర్వహించినట్లు ఆరోపిస్తున్నారు. గ్రామస్థాయిలో ఎలాంటి ఆర్థిక అవకతవకలు చేయనప్పటికీ, టీడీపీకి చెందిన కార్యకర్తల ఫిర్యాదు మేరకు తూతు మంత్రంగా విచారణ జరిపి డ్వామా అధికారులు క్షేత్రసహాయకులను తొలగిస్తున్నారు. ఎలాంటి తప్పు చేయనప్పటికీ ఎదో ఒక సాకు చూపి తొలగిస్తున్నారు. ఈ విధంగా మండలంలో ఇప్పటి వరకు దిమిలాడ, నౌగాం, మొండ్రాయివలస, వల్లభరాయునిపాడు, మర్లపాడు పంచాయతీలలో విచారణ పూర్తికాగా త్వరలో మరికొంత మంది క్షేత్రసహాయకుల తొలగింపునకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. పారదర్శకంగా ఉంటాం, కక్ష సాధింపుచర్యలు ఉండవు అని చెప్పే మంత్రి అచ్చెన్నాయుడు ఈ విధంగా తొలగింపు చర్యలకు పూనుకోవడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. విచారణలో నందిగాం ఏపీవో నాగరాజు, టీఏ ఇందిరామణి ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు 14 వినతులు

కాశీబుగ్గ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 14 వినతులు వచ్చాయి. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురికి జనన సర్టిఫికెట్లను కమిషనర్ అందజేశారు.



జనన సర్టిఫికెట్ అందజేస్తున్న కమిషనర్ రామారావు

తెలుగు ఖ్యాతి విశ్వవ్యాప్తం



కవితాగానం చేస్తున్న క్రిష్ణమూర్తి

కాశీబుగ్గ: మన తెలుగుకి హద్దులు లేవని..విశ్వవ్యాప్తమని పలాస జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల క్రిష్ణమూర్తి అన్నారు. రెండు రోజులుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలో జరుగుతున్న ప్రవాసాంధ్ర ప్రజా నాట్యమండలి 44వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు నాటిక పోటీలలో ప్రత్యేక అహ్వానితుడుగా ఆయన పాల్గొన్నారు. ఆంధ్రా, తెలంగాణాలోనే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో సైతం తెలుగు భాష విరాజిల్లుతోందన్నారు. కంప్యూటర్ యుగంలో కూడా తెలుగు విశ్వవ్యాప్తి కీర్తిని సంపాదించుకుందన్నారు. ఈ సందర్భంగా కథా, కవితలను వినిపించి అందరి మన్ననలు పొందారు. అనంతరం ఆయనకు ప్రముఖులు చేతులమీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకటరామారావు, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, లండ రుద్రమూర్తి, బాబూరావు పాల్గొన్నట్టు క్రిష్ణమూర్తి తెలిపారు.

భూ వివాదంపై ఫిర్యాదు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 347, 486, 485-3, 343లో తొమ్మిది ఎకరాల పైబడి భూవివాదంపై స్థానిక సచివాలయంలో బాధితురాలు పలికిల శ్రీలక్ష్మి సోమవారం ఫిర్యాదు చేశారు. వారసత్వంగా వస్తున్న ఈ సర్వే నంబర్ భూములపై నలుగురు సోదరి సోదరీమణులకు హక్కులు ఉన్నప్పటికీ సోదరుడు లోపింటి సునీల్‌కుమార్ తప్పుడు పత్రాలు సృష్టించి దళారుల ద్వారా భూములు అమ్ముటానికి ప్రయత్నం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై 2020 సంవత్సరంలో కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టులో కేసు వేశామన్నారు. ఈ భూములపై ఎటువంటి క్రయవిక్రయాలు జరిగిన సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించి దరఖాస్తుతో పాటు కోర్టు పత్రాలను వీఆర్వో మంగులకు అందజేశారు.

సీపీఐ కార్యదర్శిని కలిసిన 'బద్రి'



రామక్రిష్ణకు పుస్తకం అందజేస్తున్న కూర్మారావు

పలాస: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణను పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి తెలుగు జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, రచయిత బద్రి కూర్మారావు సోమవారం విజయనగరంలో కలిశారు. ఇటీవల పలాసలో విడుదల చేసిన 'ఉద్దానంలో కిడ్నీ విషాదాలు' పుస్తకాన్ని రామక్రిష్ణకు అందజేసి ఉద్దానం ప్రజలను పట్టి పీడిస్తున్న కిడ్నీ మహమ్మారి తీవ్రతను వివరించారు. బాధిత కుటంబాల తరఫున వారి సమస్యలు, పరిష్కార మార్గాలకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఇప్పుడు అందులో తగిన పరిశోధనలు జరగడానికి కావలసిన పరికరాలు, వైద్యులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు రూ.10 వేలు పింఛన్‌తో పాటు తగిన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేయాలని కోరారు. అందుకు ఆయన స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తానని.. అక్కడ పరిస్థితి తనకు కూడా తెలుసునన్నారు.పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పింఛన్ ఆపేశారని ఆవేదన



ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన అంధుడైన మనవడితో సన్యాసి

టెక్కలి: పుట్టుకతో అంధుడైన తన మనవడికి ప్రతీ నెలా వస్తున్న పింఛన్‌ను అన్యాయంగా ఆపేశారని సంతబొమ్మాళికి చెందిన వృద్ధుడు గాసితి సన్యాసి వాపోయాడు. సోమవారం టెక్కలి ఆర్డీఓకు సమస్యను విన్నవించేందుకు మనవడిని తీసుకువచ్చాడు. భర్త లేని తన కుమార్తె, మనవడు తిరుపతి తన వద్దే ఉంటున్నారన్నారు. ప్రతినెల వస్తున్న పింఛన్‌తో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేదని గుర్తు చేశాడు. ఇప్పుడు కారణం చెప్పకుండానే పింఛన్ ఆపేశారని వాపోయాడు. అధికారులు స్పందించి తన మనవడికి పింఛన్ డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు.

అటవీ సిబ్బంది కార్తీక వన సమారాధన



పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న అటవీ సిబ్బంది

కంచిలి: అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో మండపల్లిలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో అభాగ్యులతో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కాశీబుగ్గ రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికార యంత్రాంగం వన సమారాధన కార్యక్రమాన్ని చేపట్టి వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఉసిరి, మారేడు, వేప, తులసి మొదలైన ఔషధ మొక్కలు, వాటి ఉపయోగాలను వివరించారు. ఆశ్రమంలో ఉన్న విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. మందస డీఆర్వో ఐ.రాము, బీటు అధికారులు వెంకటేష్, లక్ష్మణమూర్తి, దుర్గాదేవి, భానుమూర్తి, జోగారావు, సురేష్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం!



కవిటి: పుటియాదళలో పంటపొలాన్ని పరిశీలిస్తున్న ఏవో దుర్గాప్రసాద్



వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురం వద్ద నీట మునిగిన పంటను చూపిస్తున్న రైతు



సోంపేట: కోసిన వరి పనలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: అకాల వర్షం అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంట చేతికి వచ్చే సమయంలో ఫెంగల్ తుఫాన్ రూపేణా విరుచుకుపడి నాశనం చేసింది. రెండు రోజులుగా కురిసిన వర్షంతో వరిచేలు నేలకొరిగాయి. అప్పటికే కోసి ఉంచిన వరి పనలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి, గల్లి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, బెండి, కొండవూరు, కిడిసింగి, తాడివాడ, మహాదేవపురం, గుళ్లలపాడు, పెదబాడాం తదితర గ్రామాల్లో పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. కష్టపడి పండించిన వరిపంట చేతుకి అందుతున్న సమయంలో తమ ఆశలపై తుఫాన్ నీళ్లు చల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. పెద్దబొడ్డపాడులో కొంతమంది రైతులు యంత్రాల సాయంతో కోతలు చేసి పంట పొలంలోనే ధాన్యాన్ని అమ్మకం కోసం నిల్వ ఉంచారు. వర్షాలతో వర్షం నీరు ధాన్యం బస్తాల కిందకు చేరింది.

150 ఎకరాల్లో నేలకొరిగిన పంట

సోంపేట: సోంపేట మండలంలో సుమారు 150 ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. బారువ, బేసిరామచంద్రాపురం, పలాసపురం గ్రామాల్లో వరి పంటను వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి సోమవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కోసిన పనలు మొలకెత్తకుండా ఉప్పు కలిపిన నీటిని పిచికారీ చేయాలన్నారు.



కంచిలి: కర్తలి వద్ద పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ధనుంజయ

కోతలను వాయిదా వేసుకోండి

కవిటి: వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో వరిపైరుకు జరిగిన నష్టాల్ని పరిశీలించాలని సచివాలయ వ్యవసాయ సహాయకుల్ని వ్యవసాయక్షేత్రాలకు పంపించాలని సూచించినట్టు సోమవారం తెలిపారు. పుటియాదళ గ్రామంలో పర్యటించి నేలకొరిన వరిని పరిశీలించారు.



ఇచ్ఛాపురం రూరల్: లక్ష్మీపురంలో రైతులకు సూచనలిస్తున్న భార్గవి

కంచిలిలో స్వల్ప నష్టం

కంచిలి: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వరి పంటకు కంచిలి మండలంలో వరి పంటకు స్వల్ప నష్టం వాటిల్లింది. 75 ఎకరాల్లో వరి చేలు నేలకొరిగినట్టు మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ తెలిపారు. అంపురం, కర్తలి, మఠం సరియాపల్లి, బొగాబెణి గ్రామాల్లో వరిచేలను, కుప్పలు వేసిన పరిస్థితులను మండల వ్యవసాయాధికారి పరిశీలించారు.

యాజమాన్య పద్ధతులతో పంట రక్షణ

ఇచ్ఛాపురం రూరల్: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తడిసిన వరిపంటను సంరక్షించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి టి.భార్గవి అన్నారు. బూర్జపాడు, డొంకూరు, తేలుకుంచి, రత్తకన్న, కొళిగాం పంట పొలాల్లో పర్యటించారు. మొలకలు రాకుండా ముందస్తు జాగ్రత్తగా లీటర్ నీటికి 100 గ్రాముల ఉప్పును కలిపి ఎకరానికి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

టెక్కలి: మహిళల భద్రత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీడీపీవో శోభారాణి అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మహిళల రక్షణ చట్టాలు, భద్రత తదితర అంశాలపై వివరించారు. చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ సీతారాములు, కళా శాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ విభాగం అధ్యాపకులు లీలా పద్మజ ఉన్నారు.

పీఎంఏవై దరఖాస్తులు సచివాలయాలకు అందజేయాలి

పలాస: పలాస నియోజకవర్గంలో ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన్ పథకం కింద ఇళ్లు కావలనే లబ్ధిదారులు తమ దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాలకు అందజేయాలని పీఎంఏవై సోషల్ స్పెషలిస్టు సీహెచ్ మల్లేశ్వరరావు చెప్పారు. పలాసలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. స్థలం ఉండి ఇళ్లు లేని వారు ఈ దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం పరిశీలించి త్వరలోనే గృహాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

టెక్కలి రూరల్: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. నర్సింగపల్లి, రావివలస గ్రామాల్లో సంకల్పం కార్యక్రమాన్ని సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ రాములు సోమవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం, వాటివలస కలుగు అనార్థాలపై అవగాహన కల్పించారు. కొంతమంది విద్యార్థి దశలోనే చెడు వ్యసనాలకు దూరమవుతూ నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఎవరైన గంజాయి వంటి నిషేధిత పదార్థాలు విక్రయించిన, వాడిన తమ దృష్టికి తీసుకురావాలను ప్రజలను కోరారు.

అవగాహన



బాలల సంరక్షణపై చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది రైలు ప్రయాణికులకు సోమవారం అవగాహన కల్పించారు. సోంపేట రైల్వేస్టేషన్‌లో చైల్డ్ హెల్ప్ లైన్ డెస్క్ టీం సభ్యులు ప్లాట్ ఫాంలలో ప్రయాణికులు, వెండర్స్‌కు బాలికల రక్షణ, లైంగిక దాడుల నిర్మూలన, బాలికల అక్రమ రవాణా నివారణ ను వివరించారు. అత్యవసర సమయంలో 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ ఆర్.జాస్మిన్ కుమారి, సిబ్బంది ఉన్నారు. –కంచిలి

రోడ్డును ఆక్రమించేసి..



పలాస–కాశీబుగ్గ కేటీరోడ్డులో కొంత మంది వ్యాపారులు అనుమతి లేకుండానే రోడ్లపై నో పార్కింగ్ బోర్డులు పెట్టేస్తున్నారు. దీంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫుట్‌పాత్‌ను ఆక్రమించడమే కాకుండా రోడ్డును కూడా వాడేసుకోవడంపై జనం మండిపడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రామారావు వద్ద ప్రస్తావించగా...నోపార్కింగ్ బోర్డుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదన్నారు. – కాశీబుగ్గ

రోడ్డుపైకి మురుగు నీరు



రెండు రోజులు కురిసిన వర్షంతో కాలువల్లోని మురుగునీరు, చెత్త రోడ్లపైకి చేరింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 25వవార్డు పరిధిలో ఈ పరిస్థితి నెలకొంది. ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. –కాశీబుగ్గ